ప్రత్యూష నవ్వేసింది " మీ సమాధానం యిలాగే వుంటుందని నాకు తెలుసు."

సురేష్ కొంచెం రిలాక్సయ్యాడు. ప్రత్యూష వలన కొంచెం భయం తగ్గింది.

"నన్నిలా బంధించింది చాలక ఆకలిదప్పులు కూడా తీర్చరా ఏమిటి? " మంచం మీద వాలిపోతూ అడిగింది.

సురేష్ సిగ్గుపడ్డాడు.

"సారీ డియర్! ఇప్పుడే ఫలహారాలు ఆర్డర్ చేద్దాం!" అంటూ లేచి బెల్ బటన్ నొక్కి గది తలుపు బోల్ట్ తీశాడు.

బోయ్ లోపలికొచ్చాడు.

"ఏం కావాల్సార్?"

సురేష్ ఫలహారాలు ఆర్డర్ చేశాడు.

ప్రత్యూష తన సూట్‌కేస్‌లో నుంచి చిన్న ట్రాన్సిస్టర్ బయటకు తీసి ట్యూన్ చేసింది.

"నైన్ మిలాకర్ చైన్ చురానా కిస్కా హై కామ్......" పాట వినబడుతోంది.

అతను సన్నగా పాటతోపాటు విజిల్ వేయసాగాడు హుషారుగా.

ఫలహారాలు చేస్తోండగా ప్రత్యూష నవ్వుతూ అడిగింది.

"హం తుమ్ ఏక్ కమరే మె బంద్ హై ఇలా ఎన్నాళ్ళు?"

అతనికి మళ్ళీ నీరసం వచ్చేసింది ! అవును ఇలా ఎన్నాళ్ళు?

"నీ పర్స్‌లో డబ్బున్నన్ని రోజులు!" నవ్వుతూ అన్నాడు.

"అయితే వారం రోజులు వుండాల్సి వస్తుందా?"

"అవును ప్రత్యూషా! అప్పటికి వాళ్ళు మనల్ని వేటాడటం మానేస్తారేమో ?"

"వాళ్ళంత త్వరగా మానతారని నేననుకోను"

అతని ముఖం పాలిపోయింది. అవును! తనకీ తెలుసా విషయం! వాళ్ళు జీవితాంతం వేటాడుతూనే వుంటారు.

ఇద్దరూ నిశ్శబ్దంగా ఆలోచనల్లో మునిగిపోయారు. సురేష్ కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు! కింద సందులో జనం ఈగల్లా ముసురుతున్నారు. కిక్కిరిసిపోయి వుందా సందు మనుష్లతో సైకిళ్ళతో స్కూటర్లతో. ఆ ఇరుకులో నుంచే అతి నెమ్మదిగా అదే పనిగా హారన్ కొడుతూ చీమలా పాకుతూ వస్తోందో కారు.

ఆ కారుని చూస్తూనే సురేష్ షాక్ తిన్నట్లయ్యాడు. రక్తం వేగంగా ప్రవహించసాగింది. వెన్నెముకలో నుండి వణుకు పుట్టుకొస్తోంది.

"ప్రత్యూషా ! త్వరగా రా!" అన్నాడు గాబరాగా.

ఆమె ఒక్క ఉదుటున లేచి వచ్చి అతని పక్కనే నిలబడింది.

“అదుగో ఆ కారు చూడు ” భయంగా చూపాడతను.

“మైగాడ్, మనం స్టేషన్ దగ్గర వదిలేసిన కారు !” అందామె.

“వాళ్ళు ఈ హోటల్‌కే వస్తున్నారేమో”.

ఆమె ఏమీ మాట్లాడలేదు. కారు నెమ్మదిగా వచ్చి హోటల్ ముందు ఆగింది అందులో నుంచి విష్ణుతో పాటు మరో ఇద్దరు దిగి నిలబడ్డారు.

“ప్రత్యూషా! మన ఆయుష్షు తీరిపోయింది ” అన్నాడతను.

“అవును” అంది ఆమె ముఖం మీది స్వేదబిందువులు తుడుచుకుంటూ

జరగబోయేది సురేష్ కళ్ళముందు దృశ్య రూపంలో కనబడుతోంది. తలుపులు పగలగొట్టి లోపలకొచ్చి తామిద్దరినీ బులెట్స్‌తో చంపి ముఖం ఆనవాల్లేకుండా చెక్కేసి వెళ్ళిపోతారు.

మర్నాడు పేపర్లో వార్త వస్తుంది . “హోటల్ గదిలో పట్టపగలే గుర్తు తెలియని యువతీ యువకుల దారుణ హత్యలు హంతకుల కోసం పోలీసుల వేట”

విష్ణు వాళ్ళతో ఏదో మాట్లాడాడు. ముగ్గురూ హోటల్లోకి నడిచారు.

సురేష్ కిటికీ తలుపులు మూశాడు. గదంతా చీకటి!

ఇద్దరూ వణికిపోతున్న శరీరాలతో మంచం మీద కూర్చున్నారు. వాళ్ళ గుండెలు కొట్టుకునే శబ్దాలు స్పష్టంగా వినబడుతోన్న ఫీలింగ్.

ట్రాన్సిస్టర్స్ వార్తలు చదువుతోంది టేబుల్ మీద నుంచి.

“ప్రముఖ పారిశ్రామికవేత్త, మాధురీ ఇండస్ట్రీస్ అధినేత అయిన శ్రీ అర్జున్ నేటి ఉదయం గుండెపోటు వల్ల మరణించారు-ఆయన వయసు ముప్పయ్ సంవత్సరాలు మాత్రమే! రాష్ట్ర ముఖ్యమంత్రి నేటి ఉదయం శ్రీ అర్జున్ సతీమణి శ్రీమతి మాధురిదేవిని పరామర్శించారు...”

ప్రత్యూష ట్రాన్సిస్టర్ ఆఫ్ చేసేసింది.

“ఇంక మనల్ని వాళ్ళు వదలటం కల్ల!” అన్నాడు సురేష్.

“ఎందుకని”

“అర్జున్ రూపంలో నేను బ్రతికి వుంటే-వాళ్ళకెన్నో సమస్యలు రావచ్చు కదా!”

హఠాత్తుగా ఇద్దరూ డిప్రెస్ అయిపోయారు.

ఆ భయంకరమైన పరిస్థితిలో ఇరుక్కున్నందుకు ఇద్దరికీ తమ మీద తమకే కోపం కలుగుతోంది.

ఆమె లేచి నిలబడింది అసహనంగా.

“ఎలాగూ చావబోతున్నాం- భయపడుతూ ఎందుకు చావాలి?”అందామె కోపంగా.

సురే ఆశ్చర్యంగా ఆమె వైపు చూశాడు.

ఆమె వెళ్ళి కిటికీ తలుపు తెరిచింది మళ్ళీ.

"సురేష్! ఇలారా" అందామె నెమ్మదిగా. సురేష్ ఒక్క ఉదుటున కిటికీ దగ్గరకు గెంతాడు.

విష్ణు, ఇద్దరు సెక్యూరిటి గార్డ్‌లు హోటల్‌నుంచి బయటికి వచ్చేశారు, విష్ణు మరో వ్యక్తి కార్లో వెళ్ళిపోయారు. ఇంకొకడు మాత్రం హోటల్ కెదురుగా వున్న షాప్ పక్కనే నిలబడ్డాడు!

"అంటే వాళ్ళకు మనమిక్కడున్నట్లు తెలిసిపోయింది"

"అందుకే వాడినక్కడ కాపలా వుంచారు. బహుశా మనల్ని చంపటం రాత్రికయితే సులువుగా వుంటుందనుకుంటున్నారేమో."

గంటసేపు ఇద్దరూ కిటికీ దగ్గరే నిలబడిపోయారు.

వాడు కూడా బయట అలాగే నిలబడి సిగరెట్లు కాలుస్తున్నాడు.

ప్రత్యూషకు మళ్ళీ అశాంతి పెరిగిపోతోంది. పెద్ద శబ్దంతో కిటికీ తలుపు మూసివేసిందామె.

"హోటల్ వాళ్ళు మన గుర్తులు చక్కగా వర్ణించి వుంటారు!" అన్నాడు సురేష్ మంచం మీద వాలిపోతూ. అతనికి అశాంతి అసహనం పెరిగిపోతోంది. విరక్తి కలుగుతోంది. ఆమె మాటలు అతని మీద ప్రగాఢంగా పనిచేస్తున్నాయ్.

"ఎలాగూ చస్తున్నాం! భయపడుతూ ఎందుకు చావటం?" భారంగా కళ్ళు మూసుకున్నాడతను.

"ఇంకొద్ది గంటలే వుంది మన గడువు- ఈ కాస్త సమయం కూడా చావు గురించే ఆలోచించాలా?" అతి సమీపంగా ఆమె గొంతు వినిపించిందతనికి. కళ్ళు తెరిచి చూశాడు.

ఆమె అతని మీదకు వంగిపోయింది ఆవేశంగా.

అంతవరకూ అతనినావహించిన భయం, నిరాశ, దిగులు, పశ్చాత్తాపం అన్నీ పెనుగాలిలో చిరు వృక్షాల్లా కూకటి వేళ్ళతో పెకలించుకు పోయినయ్. వాటి స్ధానంలో ఆవేశం కోరిక, ప్రతీకార వాంచ, తెగింపు అన్నీ చోటుచేసుకున్నాయ్. ఆమె పెదాలు గాఢంగా తనివితీరా చుంబించాడతను.

తామిద్దరూ ఒకరికొకరు- చావడానికీ, బ్రతకడానికీ! ప్రస్తుతం జతగా తామిద్దరే వున్నారు- ఆమెకు తనూ తనకు ఆమె!

ఇద్దరి శరీరాలూ ఆవేశంతో పెనవేసుకుపోతున్నాయ్. ఎవరి శరీరభాగమేదో తెలీని రీతిలో ఐక్యం అయిపోతున్నారు. సురేష్‌కి ఆ సమయంలో తులసి గుర్తు రావట్లేదు. ప్రత్యూషకు ఆ సమయంలో తను త్వరలో వివాహం చేసుకోబోతున్న ప్రియుడు గుర్తుకు రావటంలేదు.

వారికి తెలిసింది ఒక్కటే! కొద్దిగంటలు మాత్రం బ్రతికి వుండేదితామిద్దరే! కొద్దిగంటల తర్వాత చనిపోయేది తామిద్దరే!

ఆవేశాలు చల్లారిన కొద్ది క్షణాల తర్వాత వినిపించింది-తలుపు మీద నెమ్మదిగా తట్టిన చప్పుడు.

గుండె వేగంగా కొట్టుకోసాగింది వారికి! ఇద్దరూ చటుక్కున లేచి కూర్చున్నారు ఆమె త్వర త్వరగా చీర కట్టుకుంది.

సురేష్ సూట్‌కేస్‌లోని పిస్టల్ తీసుకుని తలుపు పక్కన నిలబడ్డాడు.

ప్రత్యూష తలుపు తెరిచింది. ఎదురుగా లావుపాటి వ్యక్తి నిలబడ్డాడు.

"లాండ్రీకి బట్టలు వేస్తారా?"

"లేదు" అనేసి తలుపు మూసివేసిందామె.

ఇద్దరూ రిలాక్సయి మళ్ళీ మంచం మీద పడుకున్నారు. చాలా సేపుగడిచిపోయింది.

"సురేష్ !" నెమ్మదిగా పిలిచిందామె.

"ఊ!"

"వాడు విష్ణు పంపిన మనిషి కాదు గదా?" అనుమానంగా అడిగింది.

"నేనూ అదే ఆలోచిస్తున్నాను" అన్నాడతను.

"మనం ఇక్కడి నుంచి వెళ్ళిపోదాం."

అతను ఆశ్చర్యంగా చూశాడామె వైపు.

"మరి బయట...వాడు...."

"ప్రాణాలు ఎలాగూ పోయేవే-పదండి?" అంటూ లేచి సూట్‌కేస్ సర్దసాగింది.

సురేష్‌లో కూడా మొండితనం ప్రవేశించింది! ఓ అమ్మాయికున్న ధైర్యం తనకు లేకపోతే ఎలా?

ఇద్దరూ గదిలో నుంచి బయటికొచ్చి రిసెప్షన్ వైపు నడిచారు. బిల్ కట్టేసింది ఆమె. రోడ్డుమీదకొచ్చేసరికి జనం కిక్కిరిసిపోయి నడుస్తున్నారు. ఎదురుగా నిలబడ్డ సెక్యూరిటీ గార్డ్ కనిపించలేదు.

"ఏమై వుంటాడు?" అడిగింది ఆమె ఆశ్చర్యంగా.

"ఏమో! పద-మనం వెళ్దాం!" ఇద్దరూ పక్కపక్కనే నడవసాగారు జనాన్ని అతి కష్టంమీద తప్పించుకుంటూ. కొంతదూరం నడిచేసరికి జనసమ్మర్థం మరింత ఎక్కువయిపోయింది.

హఠాత్తుగా గమనించాడు సురేష్ . తనకూ, ప్రత్యూషకూ అటూ ఇటూ ఇద్దరు వ్యక్తులు నడవటం. వారిద్దరినీ పరిశీలనగా చూశాడాతను. తన పక్కన నిలబడ్డ వ్యక్తిని చూస్తూనే వులిక్కిపడ్డాడు. విష్ణు.

"మనం ఎలాంటి గొడవా లేకుండా కారు దగ్గర కెళుతున్నాం సురేష్! కారు ఈ రోడ్డు చివర ఆగివుంది!" నెమ్మదిగా చిరునవ్వుతో తలతిప్పకుండా మాట్లాడాడతను.

సురేష్‌కి మళ్ళీ చెమటలు పట్టినయ్. అయినా ధైర్యం కోల్పోదల్చుకోలేదు. ఆఖరి క్షణంవరకూ పోరాడదల్చుకున్నాడు తను.

చేతులు ఊపుతూనే ఓసారి జేబు మీద నొక్కాడతను. పిస్టల్ గట్టిగా తగిలింది.

"చేతులు జేబులో పెట్టే ప్రయత్నం చేయకు- వృధా ప్రయత్నాలవన్నీ! పాపం శరత్ కూడా ఇలాగే తెలివితక్కువ పని చేయబోయాడు."

సురేష్ మాట్లాడలేదు. ప్రత్యూష భుజానికి అవతల పక్కనున్న వ్యక్తి శాలువానుంచి పిస్టల్ గురి పెట్టబడినట్టు స్పష్టంగా కనబడుతోంది.

సురేష్ వేగంగా ఆలోచిస్తున్నాడు. తనీ పరిస్థితినుంచి తప్పించుకోలేడా?

ఏమయిపోనయ్ తన ఉపాయాలూ, తెలివితేటలూ, మాటల చాక చక్యం? అవన్నీ అమ్మాయిలమీద ప్రయోగించటానికేనా?

అతనికి ఆవేశం తెంచుకొచ్చింది. పౌరుషం, కోపం, కసి అన్నీ పెరిగిపోతున్నాయ్. మళ్ళీ ప్రత్యూషవేపు చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వుతోంది. సురేష్‌కి మతిపోతోంది. తనింత టెన్షన్ ఫీలవుతోంటే ఆమె అంత అందంగా, సునాయాసంగా, హాయిగా ఎలా నవ్వగలుగుతోంది?

కారు దగ్గరకు వచ్చేస్తున్నారు. కారు పర్కింగ్‌ప్లేస్‌లో భయంకరంగా, ప్రమాదకరంగా కనబడుతోంది మృత్యు కుహరంలా, కబళించటానికి సిద్ధంగా తెరచుకున్నట్లు కారు డోర్ తెరచుకుని వుంది. డోర్ పక్కనే భీకరంగా వున్న వ్యక్తి.

"నేను కారెక్కటం లేదు" అన్నాడు సురేష్ మొండిగా.